

తెగుళ్ల నివారణ

ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమైంది. రైతులు దుక్కులు దున్నతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. 10లో▸



ఆదర్శం ఆదిబట్ల కమిషనర్

బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తన ఉదారతను చాటుకున్నాడు. 10లో▸



దొంగల బీభత్సం

నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోయారు. శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంటిని గుల్ల చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

3,75,013

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా నుంచి 3,75,013 అప్లికేషన్లు అందాయని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుంచి మొబైల్ యాప్ సర్వే చేపట్టి, అర్హుల జాబితాను తయారు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి దశలో సొంత స్థలం కలిగి ఉన్న వారిని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇళ్లను నిర్మించడం జరుగుతుందని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం వివిధ దశల్లో అందజేయనుందని తెలిపారు. స్థలం లేని నిరుపేదలకు రెండో దశలో ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తుందని చెప్పారు. సర్వే నమోదులో ఏదైనా సమస్యలు వస్తే నివృత్తి చేయడానికి ప్రతి మండలం, మున్సిపాలిటీ పరిధిలో కంట్రోల్ రూములను, కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సందేహాలను నివృత్తి చేస్తారని అన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా స్పెషల్ అధికారులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన పీఆర్‌టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు గురువారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పీఆర్ టీయూ జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది. అనంతరం జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, టైం స్కేల్ ఇవ్వాలని కోరారు. నిరంతరం విద్యారంగానికి సేవలు చేస్తున్నారని, చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దడంలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, డాక్టర్ వర్కాల పరమేష్, ఆనంద్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సభ్యులు శ్రీలత, సంపత్, సాయి, లక్ష్మి, పద్మ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవాహిక సమస్యలకు చిటికెలో పరిష్కారం



మోనోమెట్రీ వైద్యయంత్రాన్ని ప్రారంభిస్తున్న గాంధీ పాలనాధికారులు

గాంధీఆస్పత్రి: ఆహార పదార్థాలు కష్టంగా మింగడం, గుండెల్లో మంట, నాన్ కార్డియాక్ గుండెనొప్పి తదితర రుగ్మతలు అన్నవాహిక సమస్య (ఎసోఫాగియల్ మోటాలిటీ డిజార్డర్స్)తో ఉత్పన్నమవుతాయి. ఆయా రుగ్మతల తీరుతెన్నులను సులభంగా తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో అత్యాధునిక మోనోమెట్రీ వైద్య యంత్రం అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (టీడీఎఫ్) గాంధీ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగానికి వితరణగా అందించిన అత్యాధునిక ఎసోఫాగియల్ అండ్ ఆనల్ మోనోమెట్రీ వైద్య యంత్రాన్ని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, టీడీఎఫ్ రాజేశ్వరరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్ఓడీ ప్రొఫెసర్ శ్రవణ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ.. ఆహార పదార్థాలు మింగినప్పుడు కండరాలు వీటిని కడుపులోకి తరలించి తిరిగి బయటికి రాకుండా పట్టి ఉంచుతాయన్నారు. అన్నవాహికలో సమస్య ఏర్పడితే పలు రకాల రుగ్మతలు బాధిస్తాయని, వాటిని సరైన రీతిలో నిర్ధారించి చికిత్స అందిస్తే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, ఆర్ఎంఓ–1 శేషాద్రి పాల్గొన్నారు.

మెన్యూ

మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచిన ప్రభుత్వం

- రేపటి నుంచే కొత్త మెనూ అమలు
- సంక్షేమ హాస్టళ్లలో మారనున్న భోజనం
- రోజుకో వెరైటీ వడ్డించేలా చర్యలు
- గురుకులాల బాటపట్టనున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- జిల్లాలో 57 రెసిడెన్షియల్ స్కూళ్లు, 99 సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు చేకూరనున్న లబ్ధి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెనూ మారనుంది. ఆయా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందనుంది. ఇందుకోసం ప్రభుత్వం మెస్ చార్జీలు సహా కాస్మొటిక్ చార్జీలను 40 శాతం పెంచింది. శనివారం నుంచి ఈ కొత్త మెస్ చార్జీలతో పాటు కొత్త మెనూ అందుబాటులోకి రానుంది. ప్రీమెట్రిక్ హాస్టళ్లలో ప్రతిరోజు మూడు పూటలా మూడు రకాల కూరలతో భోజనం వడ్డించనున్నారు. వారానికి నాలుగు కోడిగుడ్లు, నాలుగు అరటిపండ్లు సహా రెండు సార్లు చికెన్ వడ్డించనున్నారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో వారానికి రెండు గుడ్లు, మూడు అరటిపండ్లు, ఒకసారి చికెన్ వడ్డిస్తారు. జిల్లాలో 57 రెసిడెన్షియల్ స్కూళ్లు, 99 సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న బాలబాలికలకు లబ్ధి చేకూరనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలకు చెక్ పెట్టనున్నారు.

పొంతన లేని ధరలతో తంటాలు

రైతు ఫారం వద్ద కోడి గుడ్డు ధర రూ.6.20 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.7 పలుకుతోంది. ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తోంది. ఉల్లిగడ్డ హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.50 పలుకుతుండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.70 వరకు విక్రయిస్తున్నారు. ఇక కేజీ వెల్లుల్లి రూ.350 నుంచి రూ.400, కందిపప్పు రూ.140 నుంచి రూ.160 ఉన్నాయి. ఆయిల్ ధరలు ఆకాశాన్నంటాయి. కిలో ఆయిల్ రూ.150 పైమాటే. రైతు బజార్లలో ఏ కూరగాయను పరిశీలించినా కిలో రూ.40 నుంచి రూ.60 ఉంటోంది. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు, బహిరంగ మార్కెట్లోని నిత్యవసరాల ధరలకు పొంతన ఉండడం లేదు. విధిలేని పరిస్థితుల్లో నాసిరకం కూరగాయలు, పప్పుతో ఆహారం అందిస్తున్నారు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం సంగతేమో కానీ.. కడుపు నిండా తినలేని పరిస్థితి. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.5.45 ఇస్తుండగా, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థికి రూ.8.17 చెల్లిస్తోంది. ఉన్నత పాఠశాల విద్యార్థికి గుడ్డుతో కలిపి రూ.10.67 చెల్లిస్తుండగా, ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థికి గుడ్డుకు రూ.5 చొప్పున చెల్లిస్తున్నారు.

పండుగలా నిర్వహించాలి

సంక్షేమ గృహాలు, పాఠశాలల్లో డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు కార్యక్రమానికి పండుగ వాతావరణంలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, ఈనెల 14న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు. పాఠశాలల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా హాస్టల్ వార్డెన్లు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలని, అంతా కలిసి ఒకేచోట భోజనం చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు కార్యక్రమం జరగాలని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా స్పెషల్ అధికారులు, ఎంపీడీఓలు, హాస్టల్ వార్డెన్లు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డైట్ చార్జీల పెంపు ఇలా..

తరగతి	పాత	కొత్త
3 నుంచి ఏడు	రూ.950	రూ.1,330
8 నుంచి 10 వరకు	రూ.1,100	రూ.1,540
ఇంటర్, పీజీ	రూ.1,500	రూ.2,100

కాస్మొటిక్ చార్జీలు ఇలా..

తరగతి	పాత	కొత్త
3 నుంచి 7 (బాలికలు)	రూ.55	రూ.175
8 నుంచి 10 (బాలికలు)	రూ.75	రూ.275
3 నుంచి 7 (బాలురు)	రూ.62	రూ.150
8 నుంచి 10 (బాలురు)	రూ.62	రూ.200

పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో మెనూ ఇలా..

వారం	ఉదయం	మధ్యాహ్నం	రాత్రి
సోమ	పులిహోర, సాంబార్, అరటిపండు	రైస్, పాలకూర పప్పు	రైస్, వెజిటెబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ, గుడ్డు
మంగళ	కిచిడి, సాంబార్, అరటిపండు	రైస్, పాలకూర పప్పు	రైస్, వెజిటెబుల్‌కర్రీ, సాంబారు, మజ్జిగ, గుడ్డు
బుధ	టమాటారైస్, సాంబారు	రైస్, వెజిటెబుల్ కర్రీ	రైస్, చికెన్ కర్రీ, బట్టర్‌మిల్క్, సాంబారు
గురు	పులిహోర, సాంబార్, అరటిపండు	రైస్, పాలకూర పప్పు	రైస్, వెజిటెబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ, గుడ్డు
శుక్ర	కిచిడి, సాంబారు	రైస్, పాలకూర పప్పు	రైస్, వెజిటెబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ, గుడ్డు
శని	జీరారైస్, సాంబారు	రైస్ వెజిటెబుల్ కర్రీ	రైస్,పాలకూరపప్పు, అరటిపండు, మజ్జిగ, సాంబారు
ఆది	ఉప్మా, సాంబారు	రైస్, వెజిటెబుల్ కర్రీ	బగారారైస్, చికెన్ కర్రీ, మజ్జిగ, సాంబారు

హైడ్రా దృష్టి సారించేనా!

- తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న చెరువులు
- మాసబ్ చెరువు శిఖం భూమిలో బండరాళ్లు, మట్టి డంప్
- తూతూమంత్రంగా చర్యలు.. యథావిధిగా కబ్జాలు
- హైడ్రా అధికారులు దృష్టి సారించాలంటున్న స్థానికులు

తుర్కయంజాల్: పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలోని కుంట్లూరు పెద్ద చెరువు, బడంగ్‌పేట కార్పొరేషన్, మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు చెరువులపై ఇప్పటికే దృష్టి సారించిన హైడ్రా తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో అన్యాక్రాంతం అయిన చెరువులపైనా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పురపాలక సంఘం పరిధిలోని తుర్కయంజాల్, రాగన్నగూడ, మన్నెగూడ, ఇంజాపూర్, తొర్రూర్, కొహెడ, బ్రాహ్మణపల్లిలోని అనేక చెరువులు, కుంటలు రియల్ ఎస్టేట్ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకుని అన్యాక్రాంతం అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫిర్యాదులు వచ్చినప్పుడు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని ఆ తరువాత వదిలేయడం పరిపాటిగా మారింది.

మాసబ్ చెరువు శిఖం భూమిలో..

రైతుల ముసుగులో మాసబ్ చెరువు శిఖం భూమిలో నుంచి సుమారు 60 ఫీట్ల రోడ్డు వేసేందుకు ప్రయత్నించి 80 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. నేటికీ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. 2023 మేలో గుర్రంగూడ వైపు నుంచి సాగర్ రహదారి వరకు 5 నుంచి 6 అడుగులకు పైగా నీరున్న చెరువులో పెద్ద పెద్ద బండరాళ్లు, వందలాది టిప్పర్ల మట్టిని డంప్ చేసినప్పటికీ నామమాత్రంగా చర్యలు తీసుకుని అక్రమార్కులను వదిలేశారు. పెద్ద ఎత్తున ముడుపులు ముట్టినందుకే అలా వదిలేశారనే ఆరోపణలు వచ్చాయి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సర్వే నంబర్ 205లో నిండు కుండలా నీరున్న చోట ఇదే విధంగా మట్టిని డంప్ చేసి పూడ్చిన విషయం తెలిసిందే. ఈ రెండు సంఘటనలు జరిగిన సమయంలో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చినప్పటికీ అప్పటి ఇరిగేషన్ ఏఈఈ, డీఈఈ పట్టించుకోలేదు. చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టింది లేదు. హైడ్రా విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించడంతో పాటు అక్రమార్కులకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు.

వైకుంఠధామంపై వెనక్కి..

సాగర్ రహదారికి కూతవేటు దూరంలో మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 45లోని 2.25 ఎకరాల శిఖం భూమి, సర్వే నంబర్ 43, 45లోని భూమిలో విస్తరించి ఉన్న ఎర్రకుంట ఆనవాళ్లు కూడా లేకుండా చేయాలనే కుట్ర కొన్నేళ్లుగా జరుగుతూనే ఉంది. 2016లో సర్వే నంబర్ 43లోని భూమిలో మట్టితో నింపి పూడ్చివేయడానికి ప్రయత్నించగా 'ఎర్రకుంట అమ్మకానికి సిద్ధం' అంటూ సాక్షి కథనం ప్రచురించడంతో కాస్త వెనుకడుగు వేశారు. తాజాగా ఈ కుంట పరిధిలోని కొంత భూమిలో వైకుంఠ ధామం నిర్మించేందుకు అధికారులు టెండర్లు పిలవగా పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో వెనుకడుగు వేసిన విషయం విదితమే. చుట్టుపక్కల ఉన్న ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులతో పాటు పలు రియల్ ఎస్టేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు కట్టను వెడల్పు చేసేందుకు కొందరు ప్రయత్నించి పెద్ద ఎత్తున మట్టిని డంప్ చేసినా ఇరిగేషన్ అధికారులు కనీసం ఫిర్యాదు కూడా చేయలేదు. ఈ రెండు చెరువులే కాదు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల పరిధిలోని పలు చెరువులు అన్యాక్రాంతం అవుతున్నా చర్యలు మాత్రం లేవు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు అక్రమాలను వెలికి తీసి చెరువులు, కుంటలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



మాసబ్ చెరువు శిఖం భూమిలో రోడ్డు వేసేందుకు డంప్ చేసిన మట్టి, బండరాళ్లు



మోకిలలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

ప్రభుత్వ కేంద్రాలను వినియోగించుకోండి

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

శంకర్‌పల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. గురువారం ఆయన శంకర్‌పల్లి పట్టణం, మండలంలో పర్యటించారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వలు, అమ్మకాలు, రికార్డుల వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మిన విత్తనాలకు వెంటనే రసీదులు ఇవ్వాలన్నారు. అనంతరం మండలంలోని మోకిలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. గోపులారంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న మల్లారెడ్డి అనే రైతు పొలాన్ని పరిశీలించారు. పంట దిగుబడి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అనేక సబ్సిడీలు ఇస్తోందని, మండల వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. అవకాశం ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. ప్రభుత్వం మొక్కలకు 90 శాతం, డ్రిప్‌నకు ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 80శాతం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే పంట వేసిన నాలుగో ఏడాది నుంచి దిగుబడి వస్తుందని, ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయాధికారి వెంట చేవెళ్ల ఏడీఏ సురేష్ బాబు, మండల వ్యవసాయాధికారి ఇన్‌చార్జి సురేష్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేను గురి పెడితే.. 'పారా' హుషారే!

రసూల్‌పురా: కంటోన్మెంట్ రసూల్‌పురాలో ఇన్ఫినిటీ పారా స్పోర్ట్స్ అకాడమీ, హై పర్ఫార్మెన్స్ పారా స్పోర్ట్స్ అకాడమీని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగాన మాట్లాడుతూ.. విజయానికి వైకల్యం అవరోధం కాదని పారా అథ్లెట్లు నిరూపించారని పేర్కొన్నారు. గురువారం ఇక్కడ ఆదిత్య మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్ఫినిటీ పారా స్పోర్ట్స్ అకాడమీ, హై పర్ఫార్మెన్స్ పారా స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరల్డ్ ఎబిలిటీ గేమ్స్–2024, జాతీయ, అంతర్జాతీయ పారా క్రీడల విజేతలను సత్కరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు పతకాలు సాధించడం ప్రశంసనీయమన్నారు. ప్రతిభ, పట్టుదల, అలుపెరగని స్ఫూర్తికి వీరు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, ఎలికో లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ వనిత దాట్ల, జవహర్ నవోదయ విద్యాలయ దక్షిణ విభాగ ఉప కమిషనర్ టి. గోపాల కృష్ణ, పల్లవి మెహతా, నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి

- హాస్టళ్లను నిర్లక్ష్యం చేస్తోంది
- విద్యార్థినులను పరామర్శించడానికి వెళ్తుంటే అడ్డుకుంటారా?
- మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్



వికారాబాద్‌లోని చెన్నారెడ్డి చౌరాస్తాలో రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్ తదితరులు

అనంతగిరి: ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని.. ఇందుకు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్ విమర్శించారు. తాండూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌కు గురైన విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్తున్న వారిని గురువారం వికారాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అస్వస్థతకు గురైన విద్యార్థినులను చూడడానికి తల్లిదండ్రులను కూడా అనుమతించడం లేదన్నారు. తాము బాలికల్లో ధైర్యం నింపేందుకు వచ్చామని.. ఇలా అడ్డుకోవడం దారుణమన్నారు. హాస్టల్‌కు వెళ్తే ప్రభుత్వ బండారం బయటపడుతుందన్నారు. విద్యార్థినులకు ప్రభుత్వ ఆస్పత్రిలో కాకుండా హాస్టల్‌లో వైద్యం చేయడం ఏమిటని కలెక్టర్‌ను ప్రశ్నించారు. తమను కట్టడి చేయడం భావ్యం కాదన్నారు. మీరు వసతిగృహాలను గాలికొదిలేసి, వాళ్ల అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు చూస్తున్నారని ఆరోపించారు. తాము చిన్న పిల్లలతో రాజకీయాలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడి ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి అనే దానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీసులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్‌ని అదుపులోకి తీసుకొని చన్‌గోముల పీఎస్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పలువురు నాయకులను నవాబ్‌పేట పీఎస్‌కు తరలించారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తోపాటు మరి కొందరిని పరిగి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నేతల ఆందోళన



తాండూరు ఆశ్రమ పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూరు: అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రులను పోలీసులు అడ్డుకోవడంతో తాండూరులోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. కలెక్టర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థి లీలావతి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించాలని కలెక్టర్‌ను కోరారు. బాలిక పరిస్థితి బాగుందని ఆందోళన చెందాల్సిన పని లేదని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాసాచారి, నర్కుల నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం సీఐపై వేటు!



సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణపై వేటు పడినట్లు తెలుస్తోంది. రాచకొండ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ నెల 2న రాయపోల్ గ్రామ శివార్లలో హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగమణిని సొంత తమ్ముడు పరమేశ్ హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడనే కారణంతో సీఐ సత్యనారాయణను హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు తెలుస్తోంది. మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యోదంతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృంచిన సంగతి తెలిసిందే. ఇదిలావుంటే హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ తనకు ఎలాంటి ఉత్తర్వులు అధికారికంగా అందలేదని సీఐ సత్యనారాయణ తెలపడం గమనార్హం.

నాగమణి హత్య కేసులో మరొకరి అరెస్టు

మహిళ కానిస్టేబుల్ నాగమణి హత్య కేసులో మరో నిందితుడిని గురువారం ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. కులాంతర ప్రేమ వివాహం చేసుకుందన్న కక్షతో నాగమణిని సొంత తమ్ముడు పరమేశ్ వారి స్వగ్రామమైన రాయపోల్ గ్రామ శివార్లలో ఈ నెల 2న దారికాచి కత్తితో దాడి చేసి హత మార్చిన సంగతి తెలిసిందే. మరుసటిరోజు పరమేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య చేసేందుకు పరమేశ్‌కు సహకరించిన అదే గ్రామానికి చెందిన మరో నిందితుడైన శివ(24) పోలీసులకు చిక్కలేదు. గురువారం శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఆదర్శం ఆదిబట్ల కమిషనర్



సిమెంట్ డైనింగ్ టేబుల్స్‌పై భోజనం చేస్తున్న విద్యార్థులతో కమిషనర్ బాలకృష్ణ

ఆదిబట్ల మున్సిపల్ పరిధి బొంగ్లూర్‌లోని ఆదర్శ పాఠశాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తన మనసును చాటుకున్నాడు. చిన్నారులు మట్టిలో కూర్చుని మధ్యాహ్న భోజనం చేస్తుండడం గమనించిన ఆయన పదిరోజులు గడువక ముందే సిమెంట్ డైనింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయించారు. రూ.2లక్షల దాతల సహకారంతో చెట్ల కింద టేబుల్స్ నిర్మించి గురువారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణను పిన్సిపాల్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. – ఇబ్రహీంపట్నం రూరల్



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- మెలకువలతో అధిక దిగుబడి
- షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం



వ్యవసాయాధికారి వెంకటేశం



నాగర్‌గూడలో యాసంగి సాగుకు పోసిన నారు

షాబాద్: ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమైంది. అన్నదాతలు దుక్కులు దున్నతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధితో కలిగే ప్రయాజనాలను షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం వివరించారు.

విత్తన శుద్ధి

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేయాలి. తద్వారా పంటకు కీటకాలు, తెగుళ్లు ఆశించవు. కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండైజిమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు మూడు గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉలికోడు, ముప్వ పురుగు ఆశించకుండా ఉంటుంది.

నారుమడి తయారీ విధానం

నారు పోయాల్సిన మడిని దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పారించడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి. ఎకర పొలం నాటడానికి అరగంట భూమికి ఐదు కిలోల విత్తనాలు వాడాలి. అరగుంట నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

నారులో కలుపు నివారణ

నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 మిలీ, ఒక లీటర్ నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు సైహాలోపాస్ బ్యూటైల్ 10 శాతం మందును 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు అరగుంట నారుమడికి 150 గ్రాముల చొప్పున చల్లాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ ఫాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు 20.25 రోజుల వయసు ఉన్నపుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.

నాటు వేసే విధానం

నారు ఆకు లేతగా ఉంటేనే చేను తొందరగా తిరుగబెడుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు వాడితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 44 నారు మొలకలు ఉండేలా నాటుకోవాలి.

చలి నుంచి రక్షణ చర్యలు

- చలి ప్రభావం నుంచి నారు మడుల్లో ఎదగక పోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతో పాటు అందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.
- సాయంత్రం వేళలో నీరు తీసి పగటిపూట వెచ్చటి నీరు పారించాలి.
- రోజు సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు చెక్కలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.
- జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

గ్రామాల్లో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాలి

- వన్ కార్పొరేట్– వన్ విలేజ్ అడాప్షన్ అభినందనీయం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క



ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

గచ్చిబౌలి: కార్పొరేట్ సంస్థలు గ్రామాల్లో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోషల్ ఇంపాక్ట్ కాన్‌క్లేవ్ 4.0 కార్యక్రమానికి ఆమె ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నిధులతో వన్ కార్పొరేట్– వన్ విలేజ్ అడాప్షన్ పేరిట గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదే బాటలో మరిన్ని కంపెనీలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అట్టడుగు స్థాయి ప్రజల అవసరాలను తీర్చగలిగేలా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని సూచించారు. ఇప్పటికీ ఇంటర్ నెట్ లేని గ్రామాలు ఉన్నాయని, గ్రామీణ బస్సు యాత్ర ద్వారా కార్పొరేట్ కంపెనీలకు అక్కడి పరిస్థితులు చూపించవచ్చునన్నారు. గ్రామాల్లో సాంకేతిక వెనకబాటును రూపుమాపే దిశగా ఐటీ సంస్థలు పని చేయాలన్నారు. 17 రకాల వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్నామని, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. 64 లక్షల మంది సభ్యులుగా ఉన్న మహిళా బృందాలను కోటి మందికి చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, మహిళలు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు వారధిగా నిర్మాణ్ సంస్థ పని చేస్తుందన్నారు. వన్ కార్పొరేట్– వన్ విలేజ్ అడాప్షన్ నినాదంతో కార్పొరేట్ సంస్థలు ములుగు జిల్లాలోని చంద్రుతండా, ఎల్బీనగర్, జవతారపల్లి, ఇంచన్ చెరువుపల్లి, నాగర్ కర్నూల్ జిల్లాలోని బిలాకల్, చెంచుగూడెంలను దత్తత తీసుకున్నాయి. నాలుగు గురుకులాల్లో డిజిటల్ ల్యాబ్‌లను మైక్రోసాఫ్ట్, ఏడు గురుకులాల్లో సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథెమాటిక్స్ ల్యాబ్‌లను నాస్కామ్ ఏర్పాటు చేయనున్నాయి.

యువకుడి బలవన్మరణం



తేజేశ్వర్‌రెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: మత్తుకు బానిసైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఎంపీ పటేల్‌గూడకు చెందిన గజ్జెల తేజేశ్వర్‌రెడ్డి(25) డిగ్రీ ఫెయిల్ అవ్వడంతో తనకున్న వ్యవసాయ పొలాన్ని చూసుకుంటున్నాడు. మద్యం, గంజాయికి అలవాటు పడిన తేజేశ్వర్‌రెడ్డి బుధవారం రాత్రి స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్తున్నాని చెప్పి తిరిగి రాలేదు. గ్రామంలోని తన వ్యవసాయ పొలంలో పశువులపాకలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం తల్లి పొలానికి వెళ్లేవరకు కొడుకు మృతదేహం వేలాడుతుండడం చూసి ఆమె గుండెలు బాదుకుంటుడూ పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతుడి తండ్రి కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

వ్యక్తికి రిమాండ్

కడ్తాల్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ శివప్రసాద్ తెలిపిన ప్రకారం.. ఈ నెల 5న రాత్రి మండల పరిధిలోని పల్లె చెలకతండాకు చెందిన మహిళ ఇంట్లోకి ఎవరూ లేని సమయంలో తండాకు చెదిన ఇస్లావత్ మత్రు అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం ఇస్లావత్ మత్రును అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకటయ్య

శంషాబాద్ రూరల్: వేరే గ్రామంలో ఉన్న తన కొడుకు వద్దకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన వనరాసి వెంకటయ్య(75) చిన్న గోల్కొండలో ఉన్న తన పెద్ద కొడుకు అంజయ్య ఇంటికి వెళ్లడానికి గత నెల 22న బయలుదేరాడు. అంజయ్య ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో ఇలాగే వెళ్లి కొన్ని రోజులకు ఇంటికి వచ్చాడు. ఈసారి కూడా వస్తాడని ఎదురు చూసిన కుటుంబ సభ్యులు ఎంతకీ రాక పోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్షయ వ్యాధిపై జాగ్రత్తలు తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్

బొంరాస్‌పేట: క్షయ వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత ఎక్స్‌రే శిబిరం నిర్వహించారు. 72 మందికి పరీక్షలు చేయగా 12 మందికి టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వీరికి ఆరు నెలలకుసరిపడా మందులను ఉచితంగా అందజేశారు. పౌష్టికాహారం కోసం టీబీ అలర్ట్ ఇండియా ప్రతి నెలా రూ.1,000 వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, ఆకలి మందగించినా.. సాయంత్రం పూట జ్వరం, రోజు రోజుకూ బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కొడంగల్, బొంరాస్‌పేట ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అక్షయ్, హెచ్ఈఓ రాజేశ్వరి, సీహెచ్‌ఓ శివరాజ్, రాజునాయక్, సాయి శంకర్‌రెడ్డి, రహత్ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్‌కు వెళ్తుండగా..

- గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి
- చిలుకూరు సమీపంలో ఘటన



శివకుమార్(ఫైల్)

మొయినాబాద్: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన చదువు శివకుమార్(23) భాస్కర కళాశాలలో బీఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం 5.30 గంటలకు మార్నింగ్ వాకింగ్ చేయడానికి ఇంటి నుంచి బయలుదేరాడు. చిలుకూరు సమీపంలోని మహిళా ప్రాంగణం వైపు వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన శికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భోజనంలో నాణ్యత పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న బాలకృష్ణారెడ్డి

డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థులకు ఇచ్చే భోజనంలో నాణ్యత ఖచ్చితంగా పాటించాలని శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దార్, ఎస్సీ హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక ఎస్సీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ తప్పక పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త వాటర్ ఫిల్టర్, విద్యుత్ లైట్లను అమర్చాలని సూచించారు. హాస్టల్ ప్రాంగణంలో ఉన్న మున్సిపల్ వాహనాలను తొలగించాలన్నారు. ప్రతీ వారం ఫాగింగ్ చేయించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను ఫోన్‌లో కోరారు. ప్రతీ రెండు రోజులకు ఒకసారి హాస్టల్‌ను పరిశీలిస్తానన్నారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్

- 9 కేసుల్లో హాజరు
- 12 మంది సాక్షులను క్రాస్ చేసిన న్యాయవాది కరుణసాగర్
- 19కి తదుపరి విచారణ వాయిదా

సిటీ కోర్టు: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన పలు కేసుల్లో గురువారం ఆయన నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని సిటీలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బహదూర్‌పుర, మంగళ్‌హాట్ తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మొత్తం 9 కేసులపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి రాత్రి 7 గంటల వరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 12 మంది సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజాసింగ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయగా కోర్టు రికార్డు చేసింది. తదుపరి విచారణను ఈనెల 19 కి వాయిదా వేసింది.

బీజేపీ ఎంపీ బండి సంజయ్ గైర్హాజరు..

హుజురాబాద్ ఉప ఎన్నికలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రస్తుత బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘిస్తూ రోడ్‌షో నిర్వహించి ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ కేసులపై గురువారం ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగిన విచారణకు బండి సంజయ్ గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది కరుణసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఆయన కోర్టుకు హాజరు కాలేకపోయారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం ఈ కేసుల్లో ఇద్దరు సాక్షులు హాజరు కాగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాది కరుణసాగర్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా వేసింది.

ధూల్‌పేట గంజాయి డాన్ అరెస్టు



అంగూర్‌బాయి

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్న అంగూర్ బాయి ఎట్టకేలకు గురువారం కార్వాన్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడింది. ధూల్‌పేట్ గంజాయి డాన్‌గా గుర్తింపు పొందిన అంగూర్‌బాయిని కార్వాన్ ప్రాంతంలో ఎస్టీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి అమ్మకాల్లో రూ.కోట్లకు పడగలెత్తిన అంగూర్ బాయిపై ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు, మంగల్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో 4 కేసులు, ఆసిఫ్ నగర్, గౌరారం స్టేషన్లలో 10 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో అరెస్టు చేసేందుకు ఎక్సైజ్, పోలీసులు పలు మార్లు ప్రయత్నించినా ఆమె తప్పించుకు తిరుగుతోంది. ఇప్పటికే 13 కేసుల్లో నిందితురాలిగా జైలుకు వెళ్లి వచ్చిన ఆమె కోర్టుల చుట్టూ తిరుగుతోంది. ఆమె కుటుంబ సభ్యులపై కూడా పదుల సంఖ్యలో కేసులు ఉండటం గమనార్హం. ధూల్‌పేట్‌లో గంజాయి హోల్‌సేల్, రిటేల్ అమ్మకాల్లో అరితేరిన అంగూర్ బాయిని ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా అరెస్టు చేశారు. ఆమెను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు. అంగూర్‌బాయి అరెస్ట్‌తో ధూల్‌పేటలో ఎక్సైజ్ పోలీసులు భారీ విజయాన్ని నమోదు చేశారు.

శాంతినగర్ కాలనీలో దొంగల బీభత్సం



శాంతినగర్‌లోని ఓ ఇంట్లో చిందరవందరగా పడేసిన సామగ్రి

బండ్లగూడ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోయా రు. శుభకార్యాలు, బంధువుల ఇంటికి వెళ్లి వచ్చే సరికి ఇంటిని గుల్ల చేశారు. హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీలో వరుసగా నాలుగు ఇళ్లలో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి 12 తులాల బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ. ఐదు లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్కింగ్ చేసిన కారును మరోకారు ఢీ

స్వల్పంగా ధ్వంసం

రాజేంద్రనగర్: ఔటర్‌రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి వచ్చిన మరోకారు ఢీకొట్టిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న ఎర్టిగా కారు ఉన్నట్టుండి ఆగిపోవడంతో పార్కింగ్ స్థలంలో నిలిపారు. కారులో ఉన్న నలుగురు రోడ్డు పక్కన నిలబడి వేచి చూస్తున్నారు. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న డిపెంబర్ వాహనం అదుపుతప్పి పార్కు చేసిన కారును ఢీకొట్టడంతో రెండు కార్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ధ్వంసమైన వాహనాలను ఓఆర్‌ఆర్‌పై నుంచి తొలగించారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. బైక్‌ను ఢీకొట్టి..

యువకుడికి గాయాలు

శంషాబాద్: రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సాతంరాయి రామాలయం వద్ద నివాసముండే అజయ్‌దాస్ (30) గురువారం ఉదయం టిఫిన్ తీసుకొచ్చేందుకు శంషాబాద్‌కు వెళ్లి వచ్చే సమయంలో కేఎల్‌సీసీ ఫంక్షన్ హాల్ సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో అజయ్‌దాస్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ కూతురు అదృశ్యం



సంతోష, ఆమె కూతురు రిషిక(ఫైల్)

అత్తాపూర్: బిడ్డతో ఓ తల్లి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన సి.రమేష్, సంతోష(21) భార్యభర్తలు. వీరికి 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. ఈ నెల 9వ తేదీన సంతోష తన కూతురు రిషిక(6)ను తీసుకొని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో భర్త రమేష్ బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.